ప్రజాశక్తి

బుధవారం 2 ఆగస్టు 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

యువగళానికి ఘన స్వాగతం

- పల్నాడు జిల్లాకు చేరిన లోకేష్ పాదయాత్ర
- సమస్యలు వింటూ హామీలిస్తూ ముందుకు
- వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- భారీగా తరలివచ్చిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - వినుకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పల్నాడు జిల్లాలో మంగళవారం మొదలైంది. 172వ రోజుకు చేరుకున్న పాదయాత్ర ప్రకాశం జిల్లా ముళ్ళమూరు మండలం కెల్లంపల్లి నుండి ఉదయం 11 గంటలకు నూజెండ్ల మండలం ముప్పరాజు వారిపాలెం ద్వారా పల్నాడు జిల్లాలోకి ప్రవేశించింది. టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆయన సతీమణి లీలావతి, కుమారుడు హరీష్‌బాబు, ఇతర టిడిపి నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికేందుకు వినుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి టిడిపి శ్రేణులు భారీగా వచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, కొమ్మాలపాటి శ్రీధర్, ధూలిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్, నరసరావుపేట, మాచర్ల, బాపట్ల, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, వేగేశన నరేంద్రవర్మ, నజీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, నాయకులు మనవ మోహనకృష్ణ, భాష్యం ప్రవీణ్, కందుకూరి వీరయ్య, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పోతినేని శ్రీనివాసరావు లోకేష్‌తో కలిసి

▶ 2లో

పనికి తగ్గ జీతం అడిగినందుకు అరెస్టు

మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించిన పారిశుధ్య కార్మికులు

బెదిరిస్తున్న ధరలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

భారీగా పెరిగిన కూరగాయలు, పప్పులు

కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. గతనెల రోజుల్లో కూరగాయలు అన్ని రకాలు కిలోకి రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగాయి. టమాట అందని ద్రాక్షగా మారింది. రైతుబజార్లలో కిలో రూ.130 ఉండగా మార్కెట్‌లో రూ.160 వరకు పెరిగింది. దొండ కాయలు తప్ప మిగిలిన అన్ని రకాల కూరగాయాలు మార్కెట్‌లో కిలో రూ.40కుపైనే ఉంటున్నాయి. దొండకాయలు కిలో రూ.20 పలుకుతున్నాయి. రైతు బజార్లలో ఉన్న ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు కిలో రూ.10 నుంచి 20 వరకు తేడా ఉంటోంది. దీంతో ఎక్కువ మంది రైతు బజార్లను ఆశ్రయిస్తున్నారు. అయితే రైతు బజార్లకు నాణ్యమైన సరుకు రావడంలేదు. కొన్ని రకాల కూరగాయాలు రైతు బజార్లలో కన్పించడం లేదు. సరఫరా తగ్గిందంటున్నారు.

జిల్లాలోని వివిధ రైతు బజార్లలో టమోటా కిలో రూ.130కు చేరింది. క్యారెట్ రూ.49,పచ్చిమిర్చి రూ.70, కాకర రూ.36,బీర రూ.40, క్యాబేజి రూ.24, దొండ రూ.12, బంగాళదుంపలు రూ.22, గోరుచిక్కుడు రూ.38, ఉల్లిపాయలు రూ.24, బెండకాయలు రూ.38, వంకాయలు రూ.40, దోసకాయ రూ.35, పొట్ల రూ.30, సొర రూ.24, బీట్ రూట్ రూ.34కు విక్రయించారు. ఆకుకూరల కట్ట రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్నాయి. రైతు బజార్లలో రైతుల సంఖ్య క్రమంగా తగ్గిపోయి వ్యాపారులసంఖ్య పెరుగుతోంది. బహిరంగ మార్కెట్‌లో కిలోరూ.10 నుంచి

▶ 2లో

ఉరేసుకుని నిండు గర్భిణి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నిండు గర్భిణి ఉరివేసుకున్న ఘటన సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన ప్రియ (23) ఇంటి పై కప్పునకు ఉరివేసుకుంది. రెంటచింతల మండలం దైదకు చెందిన ప్రియకు సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన కొరబండి నాగేశ్వరరావుతో సుమారు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 18 నెలల పాప కాగా ప్రియ ప్రస్తుతం 8 నెలల గర్భిణి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున రేకుల ఇంటి పైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

▶ 2లో

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మాచర్ల మండల పరిషత్ అధ్యక్షులు బూడిద మంగమ్మ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఉపాధి హామీ పనులతో పాటు వివిధ శాఖల పని తీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. జెడ్‌పిటిసి మల్లుస్వామి, వైస్ ఎంపిపి పి.సుజాత కోటిరెడ్డి, బి.శ్రీను, ఎంపిడిఒ కోటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.వాణి, ఎంఇఒ వి.నాగయ్య, పంచాయతీరాజ్ ఎఇ రామాయణం సురేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

పలువురు నాయకులకు టిడిపి నోటీసులు

అసమ్మతి నేతలతో నేడు చంద్రబాబు టెలికాన్ఫరెన్స్?

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : నియోజకవర్గంలోని పలువురు టిడిపి నాయకులకు ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవి ఆంజనేయులు నోటీసులు జారీ చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా కన్నా లక్ష్మీనారాయణ అధిష్టానం నియమించిన విషయం తెలిసిందే. అయితే ఆయనకు సహకరించని కోడెల గ్రూఉనకు చెందిన 16 మందికి జీవి ఆంజనేయులు నోటీసులు జారీ చేశారు. అస్మతి నేతలతో చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్ ద్వారా బుధవారం మాట్లాడతారని తెలిసింది.

ప్రేరణ ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక పల్నాడు జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థినికి రూ.30 వేల ఫీజును ప్రేరణ ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం చెల్లించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదివి 10వ తరగతిలో 554/600 మార్కులు సాధించిన దేసు తేజస్వినాగసాయికి చిన్న తనంలో తండ్రి మరణించడంతో ఫౌండేషన్ ఈ సాయం చేసింది. తేజస్వినాగసాయికి జెఇఇ మెయిన్స్ కోచింగ్‌కు రూ.65 వేలను భరించేందుకు ప్రేరణ ఫౌండేషన్ ప్రతినిధులు అంగీకరించారు. ప్రిన్సిపాల్ శివభాస్కర్ మాట్లాడుతూ దాతల ప్రోత్సహంతో దేసు తేజస్వినాగసాయి ఇంటర్‌లో బాగా రాణిస్తోందని, మొదటి సంవత్సరం 458/470 మార్కులు సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ కన్వీనర్ జెవికెఎస్ ప్రసాదు, సభ్యులు ఎం.రంగా శ్రీనివాసరావు, ఎస్.వెంకటనరసింహరావు, ఎస్.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.36వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజుపాలెం : మండలంలోని చౌటపాపాయపాలెంలో ఆశ కార్యకర్తగా పనిచేస్తూ అనారోగ్యంతో మంచానికి పరిమితమైన బెజ్జం సామ్రాజ్యంకు రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు రూ.36 వేల సాయాన్ని సమకూర్చారు. ఈ మొత్తాన్ని సామ్రాజ్యం కుమార్తెకు ఆరోగ్యాధికారులు డాక్టర్ కృష్ణకుమార్, రవితేజ మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ సత్యనారాయణ, మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

9వ తరగతి విద్యార్థికి ఎన్‌ఆర్‌ఐ వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు : పెదకూరపాడుకు చెందిన 9వ తరగతి విద్యార్థి లోకేష్‌కు ఎన్నారై భానుప్రకాష్ రూ.7,500 ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసిన లోకేష్‌కు భాను కాకతీయ స్కూల్లో ఫీజు చెల్లించి చదువుకోవాలని సూచించారు.

ట్రై సైకిల్ అందుబాటులో ఉంది

ప్రజాశక్తి - వినుకొండ : ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వికలాంగురాలైన భవనాసి నక్షత్రంకు ట్రై సైకిల్‌ను, పది మంది గర్భిణులకు హాజెనిక్ కిట్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. మరో ట్రైసైకిల్ అందుబాటులో ఉందని, అవసరమైన వారు 9291506317కు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు బి.ప్రసాద్, పి.రాము, జి.అనిల్, జి.పవన్, సిహెచ్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో రెడ్డి నగర్, విష్ణుకుడ్డి నగర్ అంగన్వాడీ కేంద్రాల్లో 40 మంది గర్భిణులు, బాలింతలకు రూ.20 వేలతో పోషకాహార కిట్లను మంగళవారం అందించారు. లాయర్ ఎలవర్తి శ్రీనివాసరావు, వినుకొండ సిడిపిఒ అనురాధ, విష్ణుకుండి నగర్ మాజీ కౌన్సిలర్ వి.హనుమంతరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎ.శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ సిహెచ్.కోటేశ్వరరావు, సెక్రెటరీ జి.గురునాథం పాల్గొన్నారు.

ఎంసిహెచ్ భవననిర్మాణ పనులు వేగవంతం

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలోని మాత శిశు సంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్) పనులు శరవేగంగా జరుగుతున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు (జింకానా) కార్యదర్శి, 1983 బ్యాచ్ కు చెందిన డాక్టర్ దామినేని పట్టాభి రామన్ మంగళవారం యం సి హెచ్ బ్లాక్ డాక్టర్ కిరణ్ కుమార్ తో కల్సి పరిశీలించారు. ఈ యం. సి. హెచ్ బ్లాక్ రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తుందని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఇప్పటివరకు తల్లి పిల్లల వార్డు ఇరుకైనా గదుల్లో సేవలు అందిస్తున్నారు. జింకనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణం వంద కోట్ల తో పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే రెండు ఫ్లోర్లు పూర్తి కావస్తున్నాయి. మరో నాలుగు ఫ్లోర్లు త్వరలోనే పూర్తి కానున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి లోగా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. ఈ నిర్మాణం పూర్తి అయితే అద్భుతమైన కట్టడం గా రూపొందుతుందని ఆయన చెప్పారు. డాక్టర్ రామన్ మాట్లాడుతూ యం సి హెచ్ నిర్మాణం ను మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతిష్టత్మకం గా తీసుకున్నారు. అనేకమంది పూర్వ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. ఇక్కడ పనులు వేగంగా సాగుతున్నాయి. అందరి కషి వల్ల ఈ ప్రాజెక్ట్ శరవేగంగా సాగుతుండటం పై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సివిల్ సర్జన్ ఆర్ యం ఒ సతీష్ కుమార్, డిప్యూటీ సువరింటెండెంట్ డాక్టర్ గోవింద్ నాయక్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

నర్సింగ్ హాస్టల్ నిర్వహణ తీరుపై అసంతృప్తి

ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ హాస్టల్ లో విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. నర్సింగ్ హాస్టల్‌ను రాత్రి ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థిని విద్యార్థులు ఒకేచోట తిరుగుతుండటాన్ని చూసి సిబ్బంది పై ఆయన మండి పడ్డారు. అక్కడ విశ్రాంత మహిళా ఉద్యోగి పని చేస్తుండాన్ని ఆయన ప్రశ్నించారు. జీతం ఇవ్వడం లేదు.. ఇక్కడ ఎందుకు పని చేస్తున్నారు. కనీసం రక్షణ కల్పించలేని మీరు ఇక్కడ పని చేయాల్సిన అవసరం లేదు. ఇక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆయన సూచించారు. హాస్టల్ లోకి రావాలంటే భయం గా ఉంది. ఈ ప్రాంతం లో ఎవరు తిరగడం లేదు. అలాంటప్పుడు నర్సింగ్ విద్యార్థినులకు రక్షణ ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థినులకు రక్షణ కల్పించక పోతే ఎలా అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ హాస్టల్ లో భోజనం పేరిట విద్యార్థులను లోపలకు రానివ్వద్దు. వారికి వారి హాస్టల్‌కు భోజనం వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. 70 ఏళ్ళ వద్దురాలిని సంరక్షురాలిగా పెడితే ఎలా ఆయన ప్రశ్నించారు. కళాశాల ప్రిన్సిపల్ కు ఆయన అక్కడ నుంచే ఫోన్ చేసి విద్యార్థినులకు పూర్తి రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రక్షణ ఇవ్వలేము అంటే చెప్పండి డి యం ఈ కు లేఖ రాస్తానని ఆయన చెప్పారు. 130 మంది ఉండే ఈ హాస్టల్ లో ఒకరిని మాత్రమే రక్షణ కల్పించడం భావ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల హాస్టల్ లో మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ. ఇచ్చారు. సూపరింటెండెంట్ వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ జి రమాదేవి ఉన్నారు.

బెదిరిస్తున్న ధరలు

(మొదటిపేజీ తరువాయి)

రూ.20 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. మే నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల కూరగాయాల తోటలు దెబ్బతిన్నాయి. జూన్‌లో చాలినంత వర్షాలు లేకపోవడం, జులై తిరిగి అధిక వర్షాల వల్ల ఆకుకూరల తోటలకు నష్టం జరిగింది. జూన్‌లో మొదటి పక్షం వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రతకు నష్టం జరిగింది. అతివృష్టి, అనావృష్టితో కూరగాయల తోటలకు అపార నష్టం వాటిల్లింది. కూరగాయల ఉత్పత్తి తగ్గడం వల్ల గ్రామాల్లోనే అధిక ధరలు పలుకుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ధరలను తెలుసుకుని గ్రామాల్లో ధరలు పెంచుతున్నారు. వివిధ గ్రామాల్లో జరిగే సంతల్లో ధరలు కూడా భారీగానే ఉంటున్నాయి.

భారీగా పెరిగిన పప్పుదినుసులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ప్రధానంగా పప్పుల ధరలు పెరుగుదల సామాన్యలకు ఇబ్బందికరంగా మారింది. కందిపప్పు కిలో రూ.160, మినపగుళ్ల రూ.120 నుంచి రూ.130, పెసర పప్పురూ.120, పుట్నాలుపప్పు రూ.110, వేరుశనగపప్పు రూ.140 ధరలో ఉన్నాయి. కందిపప్పు గతరెండు నెలల కాలంలో కిలో రూ.40 నుంచి రూ.60 వరకు పెరిగింది. మిగతావీ కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగాయి. స్లన్ ఫ్లవర్ ఆయిల్స్ లీటరు ప్యాకెట్స్ మాత్రం రూ.114-120 మధ్య ఉన్నాయి. గత ఆరునెలల నుంచి నూనెల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే పోపుల డబ్బాలో అధికంగా వినియోగించే ఆవాలు, జీలకర్ర ధరలు భారీగా పెరుగుతున్నాయి. కొన్ని కంపెనీల పేరుతో ఆకర్షనీయ ప్యాకెట్స్ తయారు చేసి పప్పు దినుసులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి అధిక ఎంఆర్‌పి ముద్రించి రిటైలర్లకు బాగా లాభాలు సమకూర్చి వినియోగదారులపై మోయలేని భారం మోపుతున్నారు. ఆవాలు 100 గ్రాములు రూ.30, జీలకర్ర 100 గ్రాములు రూ.80 అమ్ముతున్నారు. రెండునెలల క్రితం ఆవాలు రూ.17, జీలకర్ర రూ.30 మాత్రమే ఉండేది. ఎండుమిర్చి ధర కిలో రూ.300 నుంచి రూ.400 వరకు పలుకుతోంది.

యువగళానికి ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్రలో పాల్గొన్నారు. మహిళలు, యువతులు హారతిపట్టారు. లోకేష్‌తో సెల్ఫీల కోసం మహిళలు, యువత ఉత్సాహం చూపారు. పలువురితో లోకేష్ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు పలు హామీలు ఇస్తూ ముందుకు సాగారు.

సమస్యలపై జనం వినతులు

ముప్పరాజువారిపాలెం ప్రజలు లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. తమ గ్రామంల్లఓ 400 కుటుంబాలు నివసిస్తున్నాయని, తీవ్రమైన తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. చేతిపంపు బోరు నీరు తాగి ఫ్లోరైడ్ సమస్యతో నడుముల నొప్పులు, గార పళ్ళు, మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్నామని వివరించారు. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి ప్రతి ఇంటికి కుళాయి సదుపాయం కల్పించాలని కోరారు. పంటకు మద్దతు ధర కల్పించాలన్నారు. లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు గుక్కెడు నీళ్లు అందించడం చేతకాని ముఖ్యమంత్రి అసమర్థ ముఖ్యమంత్రి లక్షల సంక్షేమం చేశానని ప్రగంబలు పలకటం సిగ్గుచేటు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మంచినీటి సదుపాయం కల్పించేందుకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా ఈ ప్రభుత్వం వినియోగించుకోలేకపోయిందని అన్నారు. జలజీవన్ మిషన్ అమలులో రాష్ట్రం 18వ స్థానంలో ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛమైన నీరు అందిస్తామని, వ్యవసాయ పెట్టుబడులు తగ్గించి మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పుచ్ఛ నూతల పంచాయతీలోని జెసి నగర్ గ్రామవాసులు నారా లోకేష్ బాబును కలిసి అనేక సమస్యలను విన్నవించారు. మా గ్రామంలో శ్మశాన వాటిక లేక మృతదేహాలను వాగుఖననం చేయాల్సి వస్తోందన్నారు. నివేశన స్థలాల పట్టాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్న ఫలితం లేకపోయిందని, ఖాళీ ప్రభుత్వ భూములను వ్యవసాయం చేసుకునే పేదలకు కేటాయించాలని విన్నవించారు. నూజెండ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్య సదుపాయాలు లేక గర్భిణులు చిన్నారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మందులు బయట కొనాల్సి వస్తోందని చెప్పారు. చేపల వేట చేసి జీవనం సాగించే మాకు వలలు ఐస్ బాక్సులు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ సెంటు పట్టాల పేరుతో పనికిరాని స్థలాలను ప్రజాధనంతో కొనుగోలు చేసి సుమారు రూ.7 వేలకోట్లు దోచుకున్నారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. జెసి నగర్‌లో శ్మశాన వాటిక స్థలం కేటాయిస్తామన్నారు. ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టి మత్స్యకారులకు వలలు, ఐస్ బాక్సులు రాయితీపై ఇప్పిస్తామన్నారు. రవ్వారంలో టిడిపి హయాంలో సిసి రోడ్లు నిర్మించారని, సైడ్ కాలువలు నిర్మించే సమయానికి ప్రభుత్వం మారి పనులు నిలిపివేశారని అన్నారు. గ్రామ ప్రజలు అధిక శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, పొలాలకు వెళ్లే దారులు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ నిధులు దొంగిలించడంతో పంచాయతీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. పంచాయతీల్లో సమస్యలను టిడిపి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తుందని హామీనిచ్చారు. లక్ష్మీపురంఃలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, 500 మీటర్ల మేర సైడ్ కాలవలు అవసరమని, టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్లకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని పలువురు వివరించారు. వీటి పరిష్కారానికి లోకేష్ హామీనిచ్చారు.

నేటి యువగళం పాదయాత్ర షెడ్యూల్

ఇప్పటి వరకు నడిచిన మొత్తం దూరం 2283.5 కిలోమీటర్లు
మంగళవారం నడిచిన దూరం 18.6 కిలోమీటర్లు
173వ రోజైన బుధవారం పాదయాత్ర ఉదయం 8 గంటలకు పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం గుర్రపునాయుడుపాలెం క్యాంప్ సైట్ నుంచి ప్రారంభం.
10 గంటలకు ఉప్పలపాడులో రైతులతో సమావేశం
11 గంటలకు చాట్రగడ్డపాడులో స్థానికులతో మాటామంతి
మధ్యాహ్నం 12 గంటలకు వినుకొండ గంగినేని డిగ్రీ కాలేజి సమీపంలో భోజన విరామం
సాయంత్రం 4 గంటలకు వినుకొండ గంగినేని డిగ్రీకాలేజి వద్ద నుంచి పాదయాత్ర కొనసాగింపు
4.20 గంటలకు చెక్ పోస్టు వద్ద స్థానికులతో సమావేశం
4.40 గంటలకు ముండ్లమూరు బస్టాండులో స్థానికులతో మాటామంతి
5.00 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్లో బహిరంగసభ, లోకేష్ ప్రసంగం
6.15 గంటలకు బస్టాండు వద్ద స్థానికులతో మాటామంతి

ఉరేసుకుని నిండు గర్భిణి మృతి

(మొదటిపేజీ తరువాయి)

మృతురాలి భర్త నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు మతదేహాన్ని కిందకు దించి మార్చురీ బాక్స్‌లో ఉంచారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. భర్త, అత్తమామమే తమ కుమార్తెను హత్య చేసి ఉంటారని మృతురాలి తల్లిదండ్రులు గాలి స్వాతి, శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణిమృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో 9 నెలల గర్భిణీ మృతి చెందినఘటన మంగళవారం కాకుమాను-పొన్నూరు రోడ్డులో జరిగింది. కాకుమాను మండలం పాండ్రపాడు నుంచి 9 నెలలు గర్భిణి అయిన దేవిరెడ్డి వాణి (24) చికిత్స నిమిత్తం భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై పొన్నూరు వెళ్తుండగా ఉప్పరపాలెం వద్ద వెనక నుంచి వచ్చిన టాటా మ్యాజిక్ ఆటో బైక్‌ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వాణిని ఆమె భర్త పవన్‌ను పొన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మతి చెందింది. భర్త పవన్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాణి మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పొన్నూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల వీరంగంపై ఉలిక్కిపడ్డ తెనాలి

- సోషల్ మీడియాలో వైరలైన దాడి ఘటన

- పరిస్థితిని సమీక్షించేందుకు హుటాహుటిన తెనాలి వచ్చిన జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి-తెనాలి

వారంతా 15 నుంచి 20 సంవత్సరాల్లోపు యువకులే. వారు చేసిన వీరంగం అంతా ఇంతా కాదు. కూలీలపై దాడి చేయటం, అదేమని ప్రశ్నించిన అపార్ట్‌మెంట్ వాసుల పైనా దాడికి ఎగబడటం, అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో పరుగులు పెట్టించి కర్రలతో దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో జిల్లా ఎస్పీ స్పందించి, హుటాహుటిన టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. దీనికి సంబందించిన వివరాలిలా ఉన్నాయి.

స్థానిక కవిరాజాపార్కు రోడ్డులోని బాలాజి టవర్స్ వద్ద సోమవారం రాత్రి సిమెంట్ లోడు దించేందుకు ఆటోలో కూలీలు వచ్చారు. అదే సమయంలో అటుగా వెళుతున్న నలుగురు యువకులు ఆటో పక్కకు పెట్టాలని కూలీలను కోరారు. లోడు దించి, వెళిపోతామని వారు చెప్పటంతో ఆగ్రహించిన కుర్రాళ్లు వారిపై దాడికి యత్నించారు. వారు కూడా ప్రతిఘటించటం, స్థానికులు కూడా వారికి సర్ది చెప్పటంతో యువకులు అక్కడి నుంచి జారుకున్నారు. అయితే మరో పది నిముషాల వ్యవధిలోనే మొత్తం తొమ్మిది మంది యువకులు అక్కడికి చేరుకున్నారు. కూలీలపై కర్రలతో దాడి చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు గమనించి అడ్డుకునే ప్రయత్నం చేయగా తొలుత అక్కడ వాచ్‌మెన్‌పై దాడి చేశారు. కూలీలను అపార్ట్‌మెంట్ సెల్లార్, మొదటి అంతస్తులో పరుగులు పెట్టించి మరీ కొట్టారు. ఈ దృశ్యాలన్నీ అపార్ట్‌మెంట్ సిసి కెమేరాలో రికార్డయ్యాయి. యువకులు గంజాయి మత్తులో ఉన్నారని కొందరు, మద్యం మత్తులో ఉన్నారని కొందరు స్థానికులు చెప్పుకొచ్చారు. దాడిలో గాయపడిన కూలీలను ఆసుపత్రికి తరలించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. సిసి కెమేరాలో రికార్డు అయిన దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో బారీగా వైరలయ్యాయి.

హుటాహుటిన తెనాలి వచ్చిన ఎస్పీ

ఘటన వివరాలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మంగళవారం పట్టణ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. దాదాపు 12 గంటల ప్రాంతంలో వచ్చిన ఆయన రెండు గంటల వరకూ స్టేషన్‌లోనే ఉన్నారు. డిఎస్పీ బి.జనార్ధనరావుతో

మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కనే డీఎస్పీ జనార్ధనరావు

యువకుల వీరంగంపై చర్చించారు. అదే సమయంలో అల్లర్లకు పాల్పడిన వారిలో నలుగురు యువకులను పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఘటనకు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న అపార్ట్‌మెంట్ వాసులను స్టేషన్‌కు పిలిపించి అంతర్గతంగా విచారించారు. అనంతరం పట్టణ మూడు పోలీస్ స్టేషన్లతో పాటు పొన్నూరు రూరల్ సిఐలు అక్కడికి చేరుకున్నారు. క్రైమ్ రేట్, పెండింగ్ కేసులు, మరికొన్ని పాలనాపరమైన అంశాలపై వారితో ఎస్పీ చర్చించారు. స్టేషన్‌పై అంతస్తులోని కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ పనితీరు, పట్టణంలో సిసి కెమేరాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పనిచేస్తున్నాయి, పనిచేయనివి ఎందుకు పనిచేయటంలేదని డిఎస్పీ బి.జనార్ధనరావు ద్వారా తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న పోలీస్ క్వార్టర్లు, వాటి స్థితిపై

స్టేషన్‌లో సిసి కెమెరా, ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పి

సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. యువకుల వీరంగంపై మాట్లాడుతూ విచారణ జరుగుతోందని, ఘటనలో మొత్తం 9 మంది యువకులు పాల్గొన్నారని, వారిలో మైనర్లు కూడా ఉన్నారన్నారు. వారిలో నలుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అయితే గంజాయి మత్తులో వీరంగం చేశారన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారని, వారి వద్ద ఆ ఆనవాళు కనిపించలేదన్నారు. ఆటోడ్రైవర్‌కు, యువకులకు మధ్య ఆటో పార్కింగ్ విషయంలోనే ఘర్షణ జరిగినట్లు చెప్పారు. తెనాలిలో విచ్చలవిడిగా పట్టుబడుతున్న గంజాయిపై ప్రశ్నించగా, గంజాయి ఆనవాళ్లు రూపుమాపేందుకు డిఎస్పీ నేతృత్వంలో దాడులు జరగుతున్నాయన్నారు. గంజాయి కట్టడికి పూర్థిస్థాయిలో సిబ్బంది నిఘా ఉందని, అసలు జిల్లాకు ఏఏ ప్రాంతాల నుంచి గంజాయి వస్తుంది, దానిని ఎవరు చేరవేస్తున్నారన్న దానిపై కూడా నిఘా ఉంచామన్నారు. జిల్లాలో గంజాయి ఆనవాళ్ళను రూపుమాపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఐతా నగర్ లింగారావు సెంటర్‌కు వెళ్ళి అక్కడ నుంచి వెను తిరిగారు. సమావేశంలో డిఎస్పీ బి.జనార్ధనరావు, సిఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకటేశ్, పి.ప్రభాకరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గంజాయి మత్తులో దాడి చేసిన అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన దాడిలో గాయపడిన ఎన్ అంజిరెడ్డి, విష్ణుమెలకల వెంకట రత్తయ్యలను ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు ఎం సాంబశివరావుతో కలసి పరామర్శించారు. వి వెంకట రత్తయ్య, ఐద్వా పట్టణ కార్యదర్వి ఎస్ రాజ్యలక్ష్మి భర్త అంజిరెడ్డిని నిందితులు క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశారన్నారు. వీరికి కంటిమీద, తలమీద, పక్కటెముకలమీద తీవ్రంగా దెబ్బలు తగిలినట్లు బాధితులు సిపిఎం నాయకులకు తెలిపారు.

బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి తదితరులు

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 40,626
మిర్చి ఎగుమతి	: 38,322
మిర్చి నిల్వ	: 12,212

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,000
నెం.5	10,500 - 20,000
273	17,500 - 19,000
341	11,000 - 23,500
4884	17,800 - 18,000
సూపర్ 10	14,500 - 23,500
నాన్ ఎసి	
తేజ	9,500 - 23,500
బడిగి	13,500 - 26,500
దేవనూరు డీలక్స్	15,500- 20,500
తాలుకాయలు	5,000 - 14,500
కామన్ వెరైటీ	
334	16,000 - 23,000
నెం.5	20,000 - 20,000
341	12,000 - 21,000
4884	18,000 - 21,200
ఎసి స్పెషల్ వెరైటీ	
తేజా	15,300 - 24,200
బగిడి	12,900 - 24,500
దేవనూరు డీలక్స్	15,000 - 22,000
తాలుకాయలు	5,000- 13,000

వీఆర్ఎల సమస్యలపై ప్రభుత్వ వైఖరి దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు :రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లదాటినా వీఆర్ఏలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలు చేయకపోగా, ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే పత్రికలో వీఆర్ఏలకు వ్యతిరేకంగా వార్తలు రాయించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి విజయవాడలో జరిగిన వీఆర్ఏల ధర్నాలో ప్రత్యక్షంగా పాల్గొని తాము అధికారంలోకి రాగానే వీఆర్ఏలకు రూ.15వేలు జీతం ఇస్తామని, నామినీలను వీఆర్ఏలుగా నియమిస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక వీరికి ఇచ్చిన వాగ్దానాలలో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా టిడిపి హయాంలో ఇచ్చిన డిఏ మొత్తాన్ని ఒక్కొక్క వీఆర్ఏ నుండి రూ.9900లు బలవంతంగా తిరిగి రికవరీ చేశారని అన్నారు. రద్దు అయిన డిఏని కూడా పునరుద్ధరించలేదు. వీఆర్ఏల నుండి వీఆర్వోలకు ప్రమోషన్ అర్హతను పదో తరగతి నుండి డిగ్రీకి పెంచారన్నారు. ఈ విధంగా వీఆర్ఏల జీవితాలతో ఆటలాడు కుంటున్న ప్రభుత్వం తన పత్రిక ద్వారా వీఆర్ఏలకు ఏదో మేలు చేశామని అవాస్తవాలు ప్రచారం చేయడం వారిని అవమానాలకు గురి చేయడమేనని అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద వీఆర్ఏలు చేసే నిరసన కార్యక్రమానికి సిఐటియు పూర్తి మద్దతు ఉంటుందని, ఇతర రంగాల కార్మికులు, ఉద్యోగులు కూడా వారి న్యాయమైన పోరాటానికి మద్దతు ఇవ్వాలని అన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

గుంటూరు జిల్లా, పొన్నూరు మండలము, నందూరు గ్రామము, డోర్.నెం.4-26-1 కు చెందిన పారి నాగార్జున తండ్రి పారి చలమయ్య అను నాకు సంబంధించిన పొన్నూరు మండలం, వల్లభారావు పాలెం గ్రామ పంచాయితీ ఏరియాలోని డి.నెం.489/9, 487/8ఎ, 487/15, 487/14ఎ, 487/6 సర్వే నెంబర్లు గల య.1-21 శెంట్లు శేరి మాగాణి భూమికి చెందిన రిజిష్టరు చేయించుకొన్న 1039/2007 నెంబర్‌కు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు ఫొటో స్టాట్ నిమిత్తం 20-7-2023వ తేదీన తమ ఇంటి నుండి బయలుదేరి పొన్నూరు ఐలాండ్ సెంటర్‌కు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా పై దస్తావేజులున్న కవరు దారిమధ్యలో జారిపోయినది. తర్వాత ఎంతవెతికినా దొరకలేదు. పై ఒరిజినల్ దస్తావేజులున్న కవరు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్‌నెంబర్‌కు 9849465811 తెలిపి అందజేయ గలరు.

ఇట్లు
పారి నాగార్జున,
నందూరు గ్రామం, పొన్నూరు మండలం,
గుంటూరుజిల్లా.

వేలం ప్రకటన

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE::GUNTUR

E.P.No. 447/2013 in O.S. No. 33/2006

Between:
M/s.Sankara Trading Company.Rep. by its proprietor Chimakurthi Tandava Nagamalleswara Rao.
...Decree Holder/Petitioner
AND
Muvva Vasudeva Rao alias Movva Vasudeva Rao
...Judgment Debtor/Respondent

పైనెంబరు ఇ.పి.లో ఇస్తిహారు జారీకాబడి జప్తు ఖాయమైన జెడిఆర్ తాలూకు ఈదిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పైకోర్టు వారిఎదుట ది.**18-08-2023**న ఉ॥గం॥**10-30**ని॥లగాయతు వేలంవేయబడును. కావలసినవారు పాటలోపాల్గొని పాడుకొన వచ్చును. ఇతర వివరములు శ్రీకోర్టు నాజర్‌గారి వద్ద గాని లేదా డి. హెచ్.ఆర్.న్యాయవాది గారి వద్దగానీ తెలుసుకొనవలెను.

Schedule: In Guntur Dt., Chebrolu Sub-Dt., Chebrolu Gram Panchayat, Pathareddypalem (Vil), Dt.13-6-1998, Pathareddypalem S.No.67/2 Ac.0.17Cents, 67/3 Ac.0.07Cents, 67/4 Ac.0.17Cents,67/5,Ac. 0.04Cents,67/6 Ac.0.07Cents & 67/7 Ac.2.40 Cents, All the D.No's. are one piece of land to an extent of Ac.2.92cents out of total Extent of which an extent of Ac.1.00 bounded by: **East:**Land belongs to lohitha and others,**South:**Land belongs to Vallapuri Janardhana Rao,**West:**Land belongs to Bommineni Akkaiah, **North:**Land belongs to Movva Venugopala Krishnaiah.
DHR Value : Rs.3,00,000/-
Ameen Value:Rs.25,00,000/-
Proclamation and Sale:18-08-2023,
Further hearing: 00-00-2023.
(శ్రీకోర్టువారి ఉత్తర్వులమేరకు)

CHAANUKYA's "Fight for Right"
SRINIVASARAO.G.CH.
B.V. SESHU KUMAR, P.VENU, CH.VENKATESWARLU, N.VENKATA RAMANA, T. SRIRAMA KRISHNA, G. BHARATH CHANDRA
ADVOCATES FOR DHR.
Block.No.5, Om Sri Sathya Sai Sadan, Main Road, Pattabhipuram, Guntur.
Cell.No.9849658005

టమాట... తగ్గేదేలే!

ప్రజాశక్తి - మంగళగిరి

సబ్సిడీపై వినియోగ దారులకు టమాటలను అందిం చాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతు బజార్‌లో రూ.156, బహి రంగ మార్కెట్ లో రూ.230 లకు మంగళగిరిలో టమా టాలు అమ్ము తున్నారు. రూ.50లకు టమాట సబ్సిడీతో అంది స్తామన్న ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని వినియోగ దారులు వాపోతున్నారు. ప్రతి కూరలో ఉపయోగించే టమాటా రేటు పెరిగిపోవడంతో పేదలు టమాటా కొనడాన్ని మానుకున్నారు.

రికార్డు స్థాయిలో పెరిగిన పసుపు ధరలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో పసుపు ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గత ఐదు సంవత్సరాల్లో ఎన్నడు లేని విధంగా దాదాపు రూ.10 వేల మ్యాజిక్ ఫిగర్ ను దాటి రూ.11 వేలకు చేరువయ్యాయి. మంగళవారం కనిష్ట ధరలు రూ.8,450 గరిష్ట ధర రూ.10,925 సగటు ధరలు రూ.10,400 పలికాయి. మొత్తం 1928 క్వింటాలు విక్రయాలు జరి గాయి. ఎవరు ఊహించని విధంగా ఆకస్మాత్తుగా ధరలు పెరగడంతో రైతులు, వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సివిల్ సప్లయిాస్ గోడౌన్‌ను సందర్శించిన జెసి

ప్రజాశక్తి - మంగళగిరి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం రాజకుమారి మంగళవారం మంగళగిరి సివిల్ సప్లై గోడౌన్ సందర్శించారు. ప్రస్తుత గోడౌను రేకులతో నిర్మించిన దానిలో ఉంది. కొత్తగా నిర్మించిన గోడౌన్లోకి మార్చాలని అందుకు తగు చర్యలు తీసుకోవాలని జెసి రాజకుమారి అధికారులకు సూచన చేశారు. ఐసిడిఎస్‌కు పంపించాల్సిన కిట్లను పంపించారా లేదా అడిగి తెలుసు కున్నారు. గోడౌన్ డిటి ఆజాద్ పంపించినట్లుగా వివరించారు. అనంతరం మంగళగిరి రైతు బజార్ ను సందర్శించారు. రైతు బజార్ ఇన్చార్జి రమేష్ ను రైతు బజార్లు ఎన్ని షాపులు ఉన్నాయి. ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. అంతలో అరవింద స్కూల్ విద్యార్థులు రైతు బజార్‌కు వచ్చారు. జెసి రాజకుమారి విద్యార్థులతో ముచ్చటించారు.

తెనాలిలో సందడి చేసిన బ్రో చిత్రం యూనిట్

ప్రజాశక్తి-తెనాలి

ఇటీవల విడుదలైన బ్రో చిత్రం యూనిట్ మంగళవారం పట్టణంలో సందడి చేసింది. స్థానిక సంగమేశ్వర థియేటర్‌లో చిత్రం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ఆ చిత్రం హీరో సాయిధర్మతేజతోపాటు చిత్రం యూనిట్ ఆ థియేటర్‌కు చేరుకున్నారు. చిత్రం హీరో సవ్తున్న సమాచారంతో యువకులు థియేటర్ వద్ద సందడి చేశారు. గజమాలతో హీరోను సత్కరించారు. ఈ సందర్భంగా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని సాయిధర్మతేజ చెప్పారు. చిత్రాన్ని విజయవంతం చేసిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సినిమా దర్శకులు సముద్ర కని, పలువురు యూనిట్ సభ్యులున్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనలో రైతులు, నాయకులు

రైతులతో సంప్రదించే పరిహారం నిర్ణయించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూములు కోల్పోయిన రైతులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే పరిహారం నిర్ణయించాలని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. కొండమోడు-పేరేచర్ల 167ఎజి జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో రైతు సంఘం నాయకులు సమావేశమయ్యారు. అనంతరం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఇళ్ళ స్థలాలు కొనుగోలు చేసినప్పటికీ కన్వర్షన్ కాలేదనే కారణంగా వాటిని వ్యవసాయ భూములుగా పరిగణించుటం వలన తీవ్ర నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లించాలని కోరుతూ ఆర్డీఓ బిఎల్ఎన్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జి.చలమయ్య, సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్, రైతులు అవ్వారు ప్రసాదరావు, గోరంట్ల విష్ణు వర్ధనరావు, యెలినేడి రామారావు, వెంకటేశ్వరరావు, కంచేటి శేషగిరిరావు, పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులు జీతాలు వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారథి డిమాండ్ చేశారు. పట్టణంలోని జెడ్‌పి పాఠశాలలో యుటిఎఫ్ ప్రాంతీయ శాఖల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి పిడుగురాళ్ల మండల అధ్యక్షుడు సాంబశివరావు అధ్యక్షత వహించారు. విజయ సారథి మాట్లాడుతూ బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా వారి వివరాలను జిల్లా అధికారులు సవరించి తదుపరి రాష్ట్ర స్థాయి అధికారులకు ఉత్తరాలు ఇవ్వడం ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని చెప్పారు. రెండు నెలలుగా వేతనాలు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు గురవుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి జెవిబి నాయక్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతాల నుండి జరుగుతున్న అక్రమ డిప్యూటేషన్లు ఉపసంహరించుకోవాలని కోరారు. సిపిఎస్ రద్దుపై దశల వారి పోరాటంలో భాగంగా ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగే నిరాహార దీక్షను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.నాగేశ్వరరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ జమాల్, రాష్ట్ర కౌన్సిలర్ కాసిం పీరా, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సుందర్రావు, ఆనంద్, భిక్షమయ్య, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

నరసరావుపేటలో బైటాయించిన కార్మికులు, మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించిన కార్మికులు, నాయకులు

పనికి తగ్గ జీతం అడిగినందుకు అరెస్టు

- మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించిన పారిశుధ్య కార్మికులు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్
- సత్తెనపల్లిలో పలువురి అరెస్టు - నరసరావుపేటలో వంటావార్పు
- సిఎం స్పందించకుంటే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వంలో మంగళవారం పలు పట్టణాల్లోని మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలో కార్మికులు విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుటే బైటాయించారు. కార్యాలయంలోకి అధికారులు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వాగ్వాదం తెలెత్తింది. పలువురి కార్మికుల్ని పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి స్టేషన్‌కు తరలించారు.

తొలుత కార్మికుల ఆందోళనకు సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, సిఐటియు పట్టణ నాయకులు ఎం.జగన్నాథరావు, జె.రాజకుమార్ సంఘీభావం తెలిపారు. యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు చంద్రకళ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలలు ఇవ్వాలని, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంతలో మున్సిపల్ కార్యాలయం అధికారులు విధులకు హాజరయ్యేందుకు రావడంతో కార్మికులు వారిని కార్యాలయంలోకి వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. పట్టణ సిఐ యు.శోభన్‌బాబు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనను విరమించాలని కోరారు. కార్మికులు ఇందుకు తిరస్కరించడంతో పోలీసులు, కార్మికులకు వాగ్వాదం తలెత్తింది. అనంతరం నాయకులు రాజకుమార్, యూనియన్ అధ్యక్షులు చింతగుంట్ల పెద్ద వెంకయ్య, దాసరి చినకొండా, పెదాల సాంబశివరావు, తుమ్మలకుంట రమేష్‌ను పోలీసులు లాక్కెళ్ళి జీపులో ఎక్కించారు.

పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించిన కార్మికులు, నాయకులు

అనంతరం మిగతా కార్మికులను కూడా పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు పట్టణ పోలీస్ స్టేషన్ ముందు అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని ఆందోళనకు దిగడంతో వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.శివ దుర్గారావు, షేక్ సైదులు, జె.నాగమణి, డి.కొండ పాల్గొన్నారు.

అరెస్టులకు సిపిఎం, సిఐటియు ఖండన

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులను, మద్దతుగా నిలిచిన సిఐటియు నాయకులను అరెస్టు చేయడం అక్రమమని సిపిఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ ఖండించింది. ఈ మేరకు స్థానిక పుతుంబాక భవన్లో విలేకర్లతో సిపిఎం పట్టణ కార్యదర్శి విమల మాట్లాడారు. గత నెలలో 21, 22 తేదీల్లో మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ముట్టడి కార్యక్రమం చేపట్టారన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. సమావేశంలో శివదుర్గారావు, రాజకుమార్, సైదులు, గద్దె ఉమశ్రీ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అరెస్టులను సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ విలేకర్లతో మాట్లాడారు. నాయకులు టి.శ్రీనివాస రావు, కె.సీతారామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాల ముట్టడికి కార్మికులు సిద్ధమవుతారని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ హెచ్చరించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ముట్టడికి ఆయన మద్దతుగా మాట్లాడారు. కరోనా సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రాలేని పరిస్థితులలో మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి పని చేశారని గుర్తు చేశారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వదిలేసి కార్మికులకు నష్టదాయకమైన ఆప్కాస్ విధానాన్ని కార్మికులపై బలవంతంగా రుద్దారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం రోడ్డుపై వంటా చేపట్టారు. ఆందోళనకు పిడిఎం నాయకులు ఎన్.రామా రావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిలార్ మసూద్ సంఘీభావం తెలిపారు. మున్సిపల్ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్, నరసరావుపేట మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు టి.మల్లయ్య, పి.ఏసు, వీరకుమార్, కె.ప్రసాద్, సాల్మన్, నరసింహా రావు, ఇశ్రాయేలు, హుస్సేనమ్మ ,విజయలక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టగా సిఐటియు డివిజనల్ కార్యదర్శి బండ్ల మహేష్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.లక్ష జీతం ఇచ్చినా తక్కువేనని, అమ్మ కూడ చేయలేని పనులు మున్సిపల్ కార్మికులు చేస్తున్నారని అన్నారు. 010 పద్దు ద్వారా వీరందరికి వేతనాలు ఇవ్వాలన్నారు. నాయకులు ఎన్.లక్ష్మయ్య, కె.రమణ, సిహెచ్ సాగర్‌బాబు, కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు పోరాడుతున్నా సిఎంకు కనికరం లేదన్నారు. అధికారానికి రాకముందు హామీలిచ్చిన ఆయన వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన కలెక్టర్ ఆఫీస్ ముట్టడి, 17న చలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆందోళనలో కార్మికులు కె.సీతారామయ్య, కొండలు, ప్రతాప్, రామారావు, సురేంద్ర, అనిల్, వెంకటేశ్వర్లు, శ్యామ్ కోటి, వీరమ్మ అనంతలక్ష్మి, కృష్ణవేణి, మార్తమ్మ, జయేంద్ర, డి.లక్ష్మి, రైతు సంఘం నాయకులు బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించిన కార్మికులు, నాయకులు

పర్మినెంట్ చేయకుంటే చలో అసెంబ్లీ

ప్రజాశక్తి-గుంటూరు : మున్సిపల్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్.ఎమ్.ఆర్ ఉద్యోగుల్ని పర్మినెంట్ చేయాలని, లేదంటే 7వ తేదీన జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, 17వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రతిపక్ష నేత హోదాలో, అసెంబ్లీ సాక్షిగా తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నా అమలు చేయలేదన్నారు. 2022 జూలైలో ఐదు రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు. చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ అమలు చేస్తామని, ఇంజినీరింగ్ కార్మికులకు కూడా సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని అంగీకరించిన ప్రభుత్వం సంవత్సరం అయినా అమలు కాలేదన్నారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు 98 శాతం హామీల అమలు చేశామని ఉపన్యాసాలు ఇస్తున్నారని, మరి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సోమి శంకర్‌రావు మాట్లాడుతూ మాట తప్పను, మడమ తిప్పను అన్న సిఎం మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ విషయంలో మాట తప్పారని విమర్శించారు. కార్యక్రమంలో ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కుంభా శివయ్య, కాలంగి భాగ్యరాజు, గర్నపూడి ప్రసాద్ రావు, కారసాల శౌరమ్మ, సువార్త, చిన్నమ్మాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : మున్సిపల్ కార్మికుల వేతనాలును సవరిస్తామన్న ప్రభుత్వ హామీలు నెరవేర్చక పోవటం శోచనీయమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి అన్నారు. తెనాలి మున్సిపల్ కార్యాలయా ముట్టడిలో ఆయన ప్రసంగించారు. పారిశుధ్య కార్మికుల జీతభత్యాల పెంపుదల విషయంలో ప్రభుత్వం బూటకపు ప్రచారాలు చేసిందన్నారు. పారిశుధ్య క్రాప్ ఆటో డ్రైవర్లకు రూ .18.5 వేలు చెల్లిస్తామని చెప్పి రూ 9 వేల జీతానికే పరిమితం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు అధ్యక్షురాలు ఎం పద్మసుధాకర్, ఆచూరి వెంకటేశ్వర్లు, కంచర్ల సుశీల, దుర్గా ప్రసాద్, సిహెచ్ శ్రీనివాసరావు, వెలుగు సంజీవులు, ముత్యాలదుర్గా ప్రసాద్, పెద్దమ్మాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఎం టి ఎం సి కార్పొరేషన్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న సమయంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని ఇంతవరకు అమలు చేయలేదని, నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ సమస్యల పరిష్కరించకపోగా మరిన్ని సమస్యలు పెంచుతున్నారని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని అన్నారు. సిఐటియు రాజధాని కమిటీ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల నుండి కార్పొరేషన్‌లో కలిపిన 105 మంది కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ లో కలిపిన 21 గ్రామాల శానిటేషన్ కార్మికులకు కార్పొరేషన్ లో ఇస్తున్న జీతం రూ.21 వేలు అమలు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులకు పూడ్చేందుకు చీపుర్లు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, శానిటేషన్ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్ వేణు, కార్పొరేషన్ కమిటీ అధ్యక్షురాలు వి వెంగమ్మ, ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ వెంటనే పరికరాలను అందజేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేతనాల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నాలో నాయకులు

మంగళగిరిలో

గుంటూరులో

తెనాలిలో

పొన్నూరులో

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పొన్నూరు మునిసిపల్ కార్యాలయం ముట్టడి జరిగింది. ఈ సందర్భంగా ఐలాండ్ సెంటర్ నుండి కార్పొరేషన్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం సమాన పనికి సమాన వేతన ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి ఇది అమలు చేయాలని కోరారు. సిఐటియు పొన్నూరు మండల కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం కోసం ఇచ్చే నూనె, చెప్పులు, సబ్బులు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని, కార్మికుల అవసరమైన చీపురులు, పారలు అందించాలని, రిపేరు ఖర్చులు వర్కర్స్ నుండి వసూళ్లచేయడం మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంగమ్మ, బుషమ్మా, అంకమ్మ, అనురాధ పాల్గొన్నారు.

కడప ఉక్కును ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలి

విభజన హామీలను అమలు చేయాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని, కడప ఉక్కును ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని కోరుతూ సోమవారం ఎం టి ఎం సీ పరిధిలోని ప్రాతూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద సిపిఎం శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఎం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన జరిగిన నిరసనలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అదేవిధంగా ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసి, సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూనుకోవటం దుర్మార్గమన్నారు. ఒకవైపున ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రజలపై భారాలు వేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశం వెలిగిపోతుందంటూ ప్రగల్బాలు పలుకుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. నరేంద్ర మోడీ పాలనలో విశాఖ ఉక్కు, రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారాలకు నిధులు కేటాయించకుండా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన కూడా అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే విషయంలో, రాజధాని నిర్మించే దాంట్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారని ఆయన విమర్శించారు. కడప ఉక్కును ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. విభజన చట్టంలో ఉన్న హామీలు నెరవేర్చకుండా, కడప ఉక్కు కర్మాగారానికి అనుమతులను నిరాకరించడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 సంవత్సరాలు కల్పిస్తూ, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతే కాకుండా వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఇవ్వాలని, విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు చేయాలని సిపిఎం నిరసన చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, పల్లె కృష్ణ, దోకిపర్తి రాజేంద్ర బాబు, పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు, అమ్మిశెట్టి రామారావు, ఎస్.కె గన్, ఎస్ రవి కిషోర్, నల్లపు సంజీవరావు, నల్లపు గోపి, తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

పెదనందిపాడులో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

రైతు యాత్రను భగ్నం చేసిన పోలీసులు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

శాంతియుతంగా ముఖ్యమంత్రికి సమస్యను వివరించడానికి వెళుతుంటే పోలీసులు మహిళలతో సహా బలవంతంగా వాహనాలు ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించడం దారుణమని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్ విమర్శించారు. మంగళవారం పెదనందిపాడు నుండు ముఖ్యమంత్రి నివాసానికి బయలు దేరిన రైతుల్ని, మహిళలను పెదనందిపాడులో అరెస్టు చేసి రైతు యాత్రను భగ్నం చేశారు. ఈ సందర్భంగా కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడారు. 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పనులకు నిధులు కోరుతూ పెదనందిపాడు ప్రారంభమైన రైతు యాత్రను ప్రభుత్వం పోలీసుల ఇనుప పాదాల కింద నలిపివేయాలని చూడటం అవివేకమని అంతకంత ఫలితం అనుభవించక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ. 270 కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుకు సేకరించిన పొలాలకు నష్టపరిహారం కింద తొలివిడతగా రూ.110 కోట్లు విడుదల చేస్తే పనులు ప్రారంభించవచ్చని పేదల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేస్తున్న ముఖ్యమంత్రికి రూ.110 కోట్లు కలెక్టర్ ఖాతాలో కి బటన్ నొక్కడం పెద్ద సమస్య కాదని ఈ ప్రాంత ప్రజలు రైతుల సమస్య పట్ల వారు ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావట్లేదని రాజ మోహన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత వివిధ గ్రామాల నుంచి పెదనందిపాడు విచ్చేసిన రైతు సంఘ నాయకులు మహిళా రైతులు ప్రదర్శనగా వెళ్లి పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. పర్వతనేని వీరయ్య చౌదరి . కొల్లా వెంకయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అయితే విషయం ముందుగానే తెలుసుకున్న పోలీసులు రైతు యాత్రను భగ్నం చేసి ఆందోళనాకారులను అరెస్టు పత్తిపాడు, చేబ్రోలు, నల్లపాడు తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఫొటోలు తీస్తున్న సీనియర్ రిపోర్టర్‌ను పోలీసులు నెట్టివేయడంతో విలేకర్లు రోడ్డుపై బైఠాయించి నినదించారు. పోలీసులు అధికారులు జోక్యం చేసుకుని వారి ఆందోళనను విరమించారు.

ఆందోళనాకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పోలీసులకు కొల్లా రాజమోన్‌కు వాగ్వాదం

రైతు నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, అందు కోసం నిధులు కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రికి మెమోరాం ఇవ్వడానికి వెళుతున్న నల్లమడ రైతు సంఘం నాయకులను, ఆ ప్రాంత రైతులను పెదనందిపాడులో అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపియం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాలకు సాగునీరు, త్రాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. నిధుల కేటాయింపు కోసం దశల వారీగా ఆందోళన జరుగుతున్నా ప్రభుత్వ పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. భారత రాజ్యాంగంలో సమస్యల పరిష్కారానికి పోరాడే హక్కు, నిరసన తెలియజేసే హక్కువుందన్నారు. ఆందోళన కారులను అరెస్టు చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి గుంటూరు ఛానల్ పొడిగింపుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృష్ణమోహన్

దంత సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం దంత సంరక్షణ, నోటి ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ పేర్ని కృష్ణ మోహన్ మాట్లాడుతూ రోజుకు రెండుసార్లు పళ్ల తోముకోవాలని, బలం ఎక్కువగా ఉపయోగించకుండా రెండు దవడలనూ వేర్వేరుగా బ్రష్ చేయాలని చెప్పారు. నీళ్లను ఎక్కువసార్లు పుక్కిలించాలని, శీతల పానియాలను తాగొద్దని సూచించారు. స్వీట్స్, చాక్లెట్స్ తినగానే నీళ్లు పుక్కిలించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కె.వెంకట్రావు, కార్యదర్శి ఎ.వేమనరెడ్డి, సింగారావు, హెచ్ఎం కె.సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సరీల్లో ఉద్యాన శాఖాధికారి పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నర్సరీ యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సత్తెనపల్లి ఉద్యాన శాఖాధికారి సిహెచ్ జననీ అన్నారు. మండలంలోని వెన్నాదేవి సమీపంలోని మిర్చి నర్సరీలను ఆమె మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు నాసిరకం నారు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు.

విద్యార్థినిలతో మాట్లాడుతున్న వేణుగోపాల్

జెడ్‌పి పాఠశాలలో డివైఇఒ తనిఖీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల జెడ్‌పి పాఠశాలను మంగళవారం నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాల్ తనిఖీ చేశారు. పాఠ్య ప్రణాళిక, డైరీలను పరిశీలించారు. ఫార్మేటివ్ అసైన్‌మెంట్ వన్ పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెచ్ఎం బిఎం సుభానీ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండలంలోని లింగంగుంట్ల పంచాయతీ సచివాలయం-2 పరిధిలో పింఛన్ల పంపిణీని డిఆర్‌డిఎ జిల్లా పీడీ బాలునాయక్ మంగళవారం పరిశీలించారు. వృద్ధురాలు కుంకలగుంట బసవ నాగమ్మకు రూ.2,750 వృద్ధాప్య పించనును అందించారు. పంచాయతీ కార్యదర్శి కె.వి శివప్రసాద్, వాలంటీర్ ఎన్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

తహశీల్దార్ అంకారావుకు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

మణిపూర్ ఘటనలకు ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మణిపూర్ ఘటనలను నిరసిస్తూ మండల కేంద్రం రొంపిచర్లలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన చేశారు. చెరువు కట్ట సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు సిఐటియు నాయకులు ఎస్.వెంకటశ్వరరాజు అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ మణిపూర్‌లో మూణ్ణెల్లుగా జరుగుతున్నా అఘాయిత్యాలు ఆర్ఎస్ఎస్, బిజెపి సృష్టించినవేనని మండిపడ్డారు. 200 మందికి పైగా చనిపోయారని, వందల మంది క్షతగాత్రులయ్యారని, వందల గ్రామాలు తగలబెట్టారని, 200 పైగా క్రైస్తవ చర్చిలు తగులబెట్టారని విమర్శించారు. మహిళలను అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించడం సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు. అయినా వీటిపై పార్లమెంట్‌లో చర్చించడానికి బిజెపి సిద్ధంగా లేదన్నారు. ఈ ఘటనలపై ప్రధాని మోడీ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రొంపిచర్ల మండల పాస్టర్స్ యూనియన్ అధ్యక్షులు ప్రభుదాసు, వడ్లమూడి వారి పాలెం చర్చి పాస్టర్ వేముల శామ్యూల్, వైసిపి యువజన విభాగం జిల్లా నాయకులు పడాల శివారెడ్డి, సిఐటియు జిల్లా నాయకురాలు డి.శివకుమారి, రొంపిచర్ల చర్చి పాస్టర్ జాన్ వెస్లీ, బీఎస్పీ జిల్లా నాయకులు భూదాల బాబురావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, రైతు సంఘం జిల్లా నాయకులు బి.నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.బాలకోటయ్య, పౌలురాజ్ పాస్టర్ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ద్వారా ముర్రిపాలు తప్పకుండా తాగించాలని ముప్పాళ్ల పిహెచ్‌సి వైద్యులు పి.రమాదేవి చెప్పారు. ముర్రుపాల వల్ల బిడ్డలు పూర్తి ఆరోగ్యంగా ఉండడమే కాకుండా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పిహెచ్‌సిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ బిడ్డకు అమృతం లాంటివన్నారు. అవి పిల్లల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతాయని వివరించారు. ఈ నెల 8వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయని, ప్రతినెలా 1, 3వ శుక్రవారాల్లో గ్రామ పారిశుధ్య, పోషకాహార కమిటీతో అవగాహన సదస్సులు జరుగుతాయనీ వివరించారు. పారిశుధ్యం, ఆరోగ్య అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జయకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు పీటర్ డామియెన్, నాగమల్లేశ్వరరావు, జోస్పిన్ రాణి, శిరిషా, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్లలో అవగాహన ర్యాలీ

మండల కేంద్రమైన నాదెండ్లలో ర్యాలీ నిర్వహించారు. బిడ్డ పుట్టిన గంటలోపు అందించే ముర్రు పాలు తాగించాలని డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సాయిశ్వేత చెప్పారు. బిడ్డలకు పాలు పట్టడం ద్వారా మహిళలకు కొన్ని రకాల కేన్సర్లు రాకుండా ఉండే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మావతి, రూతమ్మ, సిబ్బంది విజయరాజు, భూపతిరావు, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. సాతులూరు బీసీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.పద్మ మాట్లాడారు. హెచ్ఎం మొహమ్మద్ ఇదయతుల్లా, కార్యదర్శి రాఘవయ్య, అంగన్వాడి టీచర్ కె.రమాదేవి, కల్పన, విజయలక్ష్మి, మాధవి, లక్ష్మి పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక రజక కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి దోమల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ః జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ తదితర వ్యాధులు గురించి వివరించారు. దోమతెరలు వాడాలని చెప్పారు.

బిజెపికి దాసోహమైన ఆ మూడు పార్టీలు..

మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి - క్రోసూరు

జాతి సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తూ వారికి ఊడిగం చేయడంలో భాగంగా మణిపూర్‌లో మారణ హోమానికి కారణమవుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన దాసోహం అవుతున్నాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు విమర్శించారు. సిపిఎం క్రోసూరు మండల జనరల్ బాడీ సమావేశం స్థానిక ఆమంచి భవన్లో గర్నెపూడి మహేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తూ మోడీ దేశ ద్రోహానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను పూర్తిగా విస్మరించి మోసం చేశారన్నారు. పైగా ఓట్ల కోసం జనం మధ్య మత చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వేలో మండలంలోని పేదలు సాగు చేసుకుంటున్న భూములకు యాజమాన్యపు హక్కులు కల్పించాలని కోరారు. ప్రధానమంత్రి జలజీవన్ మిషన్ పనులు లోప భూయిష్టంగా జరుగుతున్నాయని అన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు ఎ.ఆంజనేయులు, వై.వెంకటేశ్వర్లు, సిహెచ్.యేసయ్య, షేక్ ముస్తఫా, కోటిభాయి, జి.చిన్నప్ప, పి.రాజు పాల్గొన్నారు.

న్యాయవాది హత్యకు లాయర్ల నిరసన

ప్రజాశక్తి - వినుకొండ

విజయవాడ బార్ అసోసియేషన్ చెందిన న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్‌బాబు హత్యను ఖండిస్తూ వినుకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదులకు రక్షణ కోసం ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షులు వీరాంజనేయ చౌదరి కోరారు. నిరసనలో సీనియర్ న్యాయవాదులు పీజే. లూక, సిహెచ్. వెంకరెడ్డి, టి.హనుమంతరావు, ఎలీషాబాబు, బి.శ్రీనివాసులు, జె.తిరుపతిరావు, ఎం.శ్రీనివాసులు, రమణారావు, అప్పారావు, టి.ఆంజనేయులు, అశోక్‌బాబు, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు సీతారామాంజనేయులు, సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి నాగేశ్వరరావు, జి.హరిప్రసాద్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిఉన్న విద్యార్థిని విద్యార్థులు www.navodaya.gov.in ద్వారా ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అంశంపై విద్యార్థుల్లో ప్రచారం కల్పించాలని ఎంఇఒలకు సూచించారు.

కౌలు రైతు కార్డు దరఖాస్తుకు 7 వరకు గడువు

ప్రజాశక్తి-ఈపూరు : కౌలు రైతులు గుర్తింపు కార్డు (సిసిఆర్‌సి) కోసం దరఖాస్తు చేసుకోవడాని ఈ నెల ఏడో తేదీ వరకు అవకాశం కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు మంగళవారం తెలిపారు. మండలంలో 2026 కార్డుల జారీ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1298 మందికి ఇచ్చామని చెప్పారు. అర్హులైన కౌలురైతులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిఎం కిసాన్ అర్హులైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో లేదా సిఎస్సి సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాశిపాడులో తెలుగు మహిళల ప్రచారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మహిళలపై వైసిపి ప్రభుత్వం దాడులు పెరిగాయని తెలుగు మహిళ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ ముంతాజ్ అన్నారు. మండలంలోని కాశిపాడులో టిడిపి మినీ మేనిఫెస్టోపై మంగళవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో కె.పద్మలత, ఎస్.కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-ముప్పాళ్ల : ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తానని టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కందుల జార్జీ అన్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావుకు కతజ్ఞతలు తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్రలో ఎస్సీలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'మణిపూర్‌లో హింసను ఆపాలి'

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ జానపద వృత్తి కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు ఆకురాతి జగన్ అన్నారు. సోమవారం రాత్రి ఎంటిఎ సీ పరిధిలోని కుంచనపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద మణిపూర్ ఘటనపై నిరసన కార్యక్రమం జరిగింది. కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జగన్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోడీ నాయకత్వన దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్‌ల పైన దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా నరేంద్ర మోడీ పరిపాలన సాగిస్తున్నారని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు పూనుకోవడమే కాక, దేశ సంపదను ప్రైవేట్ పరం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న వైసిపి ప్రభుత్వం కానీ, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ, జనసేనలో నోరు మెదపడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర వాదులు , లౌకికవాదులు దేశాన్ని రక్షించుకునేందుకు, శాంతి కాముకులు కలిసి రావాలని ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కొట్టే కరుణాకర రావు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పల్లె కృష్ణ, సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, నల్లపు బాబురావు, బిదురుదు గడ్డ ఏలియా, మత్తయ్య, మహేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లి :మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె లక్ష్మి తెలిపారు. మంగళవారం తాడేపల్లి పిహెచ్‌సి వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సుగుణ, వి రేణుక, భాగ్యలక్ష్మి, కవిత, వరలక్ష్మి, రేణుక పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే మణిపూర్ ఘటనకు ప్రధాన కారణమని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం తాడేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్యామల, దుర్గ, శివమ్మ, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ప్రచారంల మాట్లాడుతున్న ఆకురాతి జగన్

తాడేపల్లిలో ఆశాల నిరసన

మున్సిపల కార్మికులతో మాట్లాడుతున్న వి దుర్గారావు

జెఎసి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక నల్లచెరువు రోడ్డులోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం వద్ద నుండి కలెక్టరేట్ వరకూ జెఎసి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. సుమారు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు, బకాయిలు విడుదల చేయాలని, పిఆర్‌సి-2022ను వెంటనే మలు చేయాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ సమస్యలు పరిష్కరించట్లేదని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు.ర్యాలీ అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందచేశారు. ర్యాలీని తొలుత ఎస్ఈ ఎ.మురళికృష్ణయాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎఒ బి.వెంకటేశ్వరరావు, జెఎసి నాయకులు యం.వీరాంజనేయులు, ఎస్.రాజేష్‌ఖన్నా, షేక్.సుబానీ, జి.బ్రహ్మయ్య, కె.వి.సుబ్బారావు, జి.గురునాధరావు, సిహెచ్. పురుషోత్తమరావు, ఎల్.వరప్రసాద్, వి.నాగేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఈ మురళికృష్ణయాదవ్

స్వర్ణముఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్వర్ణముఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోస్టల్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో గొలుసు కొండలరావు-నాంచారమ్మ వద్ద ఉన్న మన ఆప్టికల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వచ్చిన పేషెంట్లకు బిపి, షుగర్, కంటి, దంత, రక్త పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించారు. ఈక్యాంప్‌లో స్వర్ణముఖి ఫౌండేషన్ సభ్యులు, కోస్టల్ కేర్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ క్యాంప్‌కు హాజరైన పేషెంట్లకు ఓపి, రక్తపరీక్షలు, మందులు, అడ్మిషన్‌లలో రాయితీ ఉంటుందని తెలిపారు. అన్ని రకాల హెల్త్ ఇన్సూరెన్స్‌లు సర్జికల్ ప్యాకేజి ఉంటుందని, ఆతి తకువ ఖర్చుతో ఆపరేషన్స్ నిర్వహిస్తామని హాస్పిటల్ యాజన్యం తెలిపింది.

వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రజల చెంతకు చేరాల్సిన మంచినీరు వృధాగా మురికి కాలువలో కలుస్తుంది. తాడేపల్లి పట్టణంలోని ఆర్ఎంఎస్ కాలనీ వద్ద గల వాటర్ ట్యాంకు నుంచి మంచినీరు పొంగిపొర్లి పైపు ద్వారా మురికి కాలువలోకి చేరుతుంది. పట్టణంలో మంచినీరు అందని ప్రాంతాలు కూడా ఉన్నాయి. పైపులైన్ల రిపేరు జరుగుతున్న నేపథ్యంలో సక్రమంగా వచ్చే ప్రాంతాల్లో కూడా మంచినీరు అందని ద్రాక్షగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ముంగిట చేరాల్సిన మంచినీరు వృధాగా మురికి కాలువల్లో కలవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి వృధాను అరికట్టి సక్రమంగా ప్రజలకు అందే విధంగా ఎంటిఎంసి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలివిగో పరిష్కరించండి..

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు బద్దిగం శివరామిరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. గ్రామంలో ఎక్కడికక్కడ రోడ్లు తవ్వేయడం వల్ల బస్సులు తిరగడం కూడా ఇబ్బందిగా మారిందని ఆయన చెప్పారు. కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా తాడేపల్లిలో ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలేదన్నారు. సీతానగరం, మార్కెట్ ప్రాంతాల్లో రోడ్ల మీదే మాంసం విక్రయాలు జరుగుతున్నాయని, గంజాయి బ్యాచ్, చైన్ స్నాచర్స్ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ముఖ్యమంత్రికి పంపిన లేఖలో పేర్కొన్నారు. రెవెన్యూ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రులతో పాటు ఎంపి అయోధ్యరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్, ఎంఆర్ఒ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఫ్యాక్స్ రూపంలో వినతిపత్రం పంపినట్లు తెలిపారు.

కాకరపర్తికి లయన్స్ డిస్ట్రిక్ట్ పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి :పట్టణానికి చెందిన లైన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం లయన్స్ డిస్ట్రిక్ట్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపిక పత్రాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె విజయ నంద నుంచి మంగళవారం అందుకున్నట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. 2021-22 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్316-హెచ్ జిల్లాకు డిస్ట్రిక్ట్ గవర్నర్ అడ్వైజర్ గా అందించిన సేవలకు గుర్తింపుగా పురస్కారం లభించి నట్లు ఆయన చెప్పారు. ఈనెల 6న గుంటూరు అమరావతి రోడ్ లోని బివిఆర్ కన్వెన్షన్ లో నిర్వహించే కార్యక్రమంలో ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ సభ్యులు అభినందించారు.

లోకేష్‌కు రాజధాని రైతుల సంఘీభావం

ప్రజాశక్తి - తుళ్లూరు : టిడిపి నాయకులు నారా లోకేష్ ను రాజధాని రైతులు మంగళవారం కలిశారు.లోకేష్ పాదయాత్ర ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకుని అమరావతి రైతు జెఏసి నాయకులు పువ్వాడ సుధాకరరావు, మరికొందరు మహిళా రైతులు కలిసి తమ ఉద్యమానికి మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు.

లోకేష్‌ను కలిసిన ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలి

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం పల్నాడు జిల్లాలో ప్రవేశించిన సంగతి తెలిసిందే. పాదయాత్రలో భాగంగా నూజెండ్ల మండలం ముప్పరాజు పాలెం క్యాంపు సైటుకు చేరుకున్న లోకేష్‌ను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కలిశారు. లోకేష్‌కు సాదర స్వాగతం పలికారు. పాదయాత్రకు వస్తున్న స్పందనపై ఆయనకు వివరించారు. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న తరుణంలో పాదయాత్రతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొందని ఆయనకు వివరించారు. అలాగే తెనాలి నియోజకవర్గంలో నిర్వహించిన జనజాగృతి యాత్ర, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాలపై ప్రజల స్పందనను ఆయనకు వివరించారు. అనంతరం లోకేష్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు. అలాగే త్వరలో గుంటూరు జిల్లాలో జరగాల్సిన లోకేష్ పాదయాత్రపై పార్టీ నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఆలపాటి వెంట నాయకులు

అనుమతులతోనే లేఅవుట్‌లు ఏర్పాటు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు లేదా లేఅవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తిచేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ కాకాని రోడ్డులో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లేఅవుట్, నందివెలుగు రోడ్డులో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్‌మెంట్‌లను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్డు విస్తరణ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్‌గేజ్ ప్లాట్లు, యుటిలిటి ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరి, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలను పరిశీలించారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్లను సమగ్రంగా పరిశీలించి, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అలాగే నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబందనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌టిపిలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డిపిఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువపత్రాలు అప్ లోడ్ చేయాలని, లేకుంటే తదుపరి అనుమతులను నిలిపివేయడం జరుగుతుందన్నారు. పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసిపి బాబురావు, టిపిబిఓ రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అరకొర పరిహారంతో భూములివ్వం

సిఆర్‌డిఎ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన ఉండవల్లి రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు

అరకొర పరిహారం కోసం భూములు ఇచ్చేదిలేదని తాడేపల్లి మండలం ఉండవల్లి రైతులు మంగళవారం తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.కృష్ణానది కుడి ఒడ్డు తనిఖీ మార్గాన్ని విస్తరించడం, బలోపేతం చేయడం 'కోసమంటూ సిఆర్‌డిఎ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) గత నెల ఒకటవ తేదీన రైతులకు అవార్డు (పరిహారనిర్ధారణ) విచారణ నోటీసులు ఇచ్చారు. 1.10 సెంట్లు భూమికి సంబంధించి 11 మంది రైతులకు ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం భూ సేకరణ, పునరావాస, పున:స్థాపన చట్టం 30 /2013 కింద నోటీసులు అందజేశారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో ఆగష్టు 1 వ తేదీన తెలపాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. దీంతో రైతులు సిఆర్‌డిఎ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఎలాంటి గ్రామసభలు నిర్వహించకుండా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా గజం ధర కేవలం రూ. 5 వేలుగా నిర్ణయించడం జరిగిందని, దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. గజం రూ. 20 వేలు నష్ట పరిహారంగా చెల్లిస్తే తప్ప తాము సమ్మతించేది లేదని స్పష్టం చేశారు.

గీతాంజలి విద్యార్థులకు రాష్ట్రస్థాయి పతకాలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గీతాంజలి స్కూల్ విద్యార్థులు జులై 29 30 తేదీలలో కర్నూలు జిల్లాలోని గార్గేయ పురంలో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో వివిధ విభాగాలలో పతాకాలు సాధించారని గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ శ్రీమతి రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పీడ్ ఆఫ్ అండర్ 17 బాలుర విభాగం లో పి పవన్ గోల్డ్ మెడల్ సాధించగా, టి శ్రీ వర్ధన్ సిల్వర్ మెడల్, మేఘవర్ధన్ బ్రాంజ్ మెడల్,సాధించారన్నారు. అండర్ 14 బాలుర విభాగంలో ఏ పురంధర్ గోల్డ్ మెడల్, విగ్నేష్ బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. అదేవిధంగా అండర్ 14 బాలికల విభాగంలో ఎం పూజిత గోల్డ్ మెడల్, జి. సావిత్రి బ్రాంజ మెడల్, అండర్ ఏ బాలురు విభాగంలో ఏ హేమ శివ శంకర్ గోల్డ్ మెడల్, జి జితేంద్ర సిల్వర్ మెడల్, బి ప్రజ్వల్ బ్రాంజ్ మెడల్ , అండర్ 8 బాలికల విభాగంలో అన్విత గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆమె తెలిపారు. తమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రోప్ స్కిప్పింగ్ జిల్లా కార్యదర్శి శివకృష్ణ మరొక వ్యాయామ ఉపాధ్యాయులు షాహిన్, పవన్‌ల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

తాడేపల్లిలో కండ్లకలకలు

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలో కండ్లకలకలు కలకలం సృష్టిస్తున్నాయి. ప్రతి బజారులో కండ్లకలకల ఇళ్లు ఉందంటే ఆశ్చర్య కలగక మానదు. సీజనల్‌గా వచ్చే ఈ వ్యాధి గత వారం రోజుల నుంచి పట్టణంలో విజృంభిస్తోంది. దీని వల్ల ఇబ్బంది పడాల్సిన అవసరంలేదని తాడే పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ కెవి కిరణ్‌కుమార్ తెలిపారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రెండు మూడు రోజుల్లోనే కండ్లకలక తగ్గిపోతుందని చెప్పారు. ఇంట్లో ఎవరికైనా కళ్లు ఎర్రగా కనిపిస్తే వారి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. కండ్ల కలక వచ్చిన వారు ఓ గదిలో ఉండి విశ్రాంతి తీసు కోవాలన్నారు. కంటికి ఒత్తిడి, శ్రమ కలిగించే పనులు చేయ కూడదన్నారు. కండ్లకలకలు వచ్చిన వారి కళ్లు చూడకుండా ఉండటం మంచిదన్నారు. కళ్లలోకి చూడటం, వారి కళ్లు ఎలా ఉన్నాయని పరిశీలించడం మంచిది కాదన్నారు. వీలైతే పవర్ లేని కళ్లజోడు వాడాలన్నారు. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఒక వేళ కళ్లు ఎర్రగా ఉండి కండ్లకలక వచ్చిందనే అనుమానం వస్తే వాటిని చేతితో నలపకూడదన్నారు. ఈ వ్యాధి వచ్చినప్పుడు ప్రయాణాలు చేయకపోవడమే మంచిదన్నారు. ఫోన్‌లు, టివిలు చూడకుండా పూర్తి విశ్రాంతి తీసుకోవాలన్నారు. వైద్యుని సలహా మేరకు చుక్కల మందు గంటకు ఒకసారి వేసుకోవాలన్నారు.

నారా లోకేష్‌కు ఘన స్వాగతం

యువగళం పాదయాత్రకు భారీగా హాజరైన ప్రజలు - పలు గ్రామాల్లో వినతుల వెల్లువ

ప్రజాశక్తి-వినుకొండ : యువగళంపాదయాత్ర పల్నాడుజిల్లా వినుకొండ నియోజకవర్గంలోకి ప్రవేశించగానే ప్రకాశం జిల్లా సరిహద్దుల్లోకి నారా లోకేష్‌కు ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు నేతృత్వంలో లోకేష్ భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ఆంజనేయులు తన అనుచరులతో లోకేష్‌కు అఖండ స్వాగతంపలికారు. మాజీమంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పత్తిపాటిపుల్లారావు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నక్కా ఆనందబాబు, టిడిపి సీనియర్ నాయకులు యరపతినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్, కొమ్మలపాటి శ్రీధర్, చదలవాడ అరవింద బాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, వేగిసేన నరేంద్ర వర్మ, నజీర్ అహ్మద్, కోవెల మూడి రవీంద్ర, పార్టీ నాయకులు మనవ మోహనకష్ణ, భాష్యం ప్రవీణ్, కందుకూరి వీరయ్య, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పోతినేని శ్రీనుల, రావిపాటి సాయి, చిట్టాబత్తిన చిట్టిబాబుతో పాటు అనేకమంది నాయకులు నారా లోకేష్ బాబు యువ గళం పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. తరువాత ఆయన వెంట నడిచారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ లోకేష్ ముందుకుసాగారు.



పల్నాడులో జగనన్న సురక్ష లక్ష్యం పూర్తి

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న సురక్ష పథకం ద్వారా జరిపిన సర్వే కార్యక్రమం ద్వారా 97 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళ వారం మీడియాతో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఉన్న 538 సచివాలయాల ద్వారా 10,770 మంది వాలంటీర్లు జూన్ 24 నుంచి జూలై 31 వరకు సర్వే కార్యక్రమం పూర్తి చేయించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జగనన్న సురక్ష పథకం ద్వారా 1,54,033 దరఖాస్తులు వచ్చాయని, అందులో 1,43,755 దరఖాస్తులు పరిశీలన చేసి,1,39,498 ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశా మన్నారు. మిగిలిన 4,970 దరఖాస్తులు ఆధార్ కార్డుల పేర్లు తప్పులు, ఫోన్ నంబర్ల తప్పులు, జనన, మరణ తేదీ ధ్రువీకరణ పత్రాలు తదితర అంశాలకు సంబంధించినవి పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అన్నీ కలిపి 1,44,468 సంక్షేమ పథకాలకు సంబంధించినవి, ఇంటిగ్రేటెడ్ ధ్రువీకరణ పత్రాలు, విద్యా సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాల నమోదుకు నిర్ణీత గడువు ఉంద న్నారు. 7శాతం పెండింగ్ ఉన్నాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం నిర్దిష్ట కాల పరిమితిలోపు ప్రజలకు సకాలంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం కోసం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సదర్భంగా జిల్లాలోని ప్రజల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించడం ద్వారా మేలు చేసే కార్యక్రమం చేపట్టి విజయవంతం చేసిన వాలంటీర్లను, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి అధికారిణి మహాలక్ష్మీ, కలెక్టరేట్ ఏ.ఓ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని సయ్యద్ హబీబున్నీసాకు తమ యూని వర్సటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వీసీ ప్రొఫె సర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. హబీ బున్నీసా 'కాంప్రెహెన్సివ్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ప్రిటియా టింక్టోరియా సీడ్ ఫైబర్స్ బేస్డ్ సిమెంట్ కాంపోసిట్స్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారన్నారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ ఎన్.రూబెన్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. డాక్టరేట్ పొందిన సయ్యద్ హబీబున్నీసాను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినంది ంచారు.

చలపతి ఫార్మసీలో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

చలపతి ఫార్మసీ కాలేజి పూర్వ విద్యార్థుల సంఘంతో కలిసి ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ప్రాంగణంలో క్విట్ స్మోకింగ్ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య

పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

సంస్థ లెక్కల ప్రకారం మరణానికి దారితీసే వ్యాధుల జాబితాలో క్యాన్సర్ రెండోస్థానంలో ఉందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ అత్యంత ప్రభలమైన వాటిలో ఒకటని, అధిక కాలుష్య స్థాయిలో, రేడియేషన్, ధూమపానం, హానికరమైన రసాయనాలకు ప్రభావి తం కావటం, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీస్తుం దని చెప్పారు. ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను విశ్లేషించటానికి స్పైరోమీటర్ చెస్ట్ ఎక్స్‌రే, సిటీ స్కాన్ లేదా పిఈటి సిటీ స్కాన్, బ్రాంకోస్కోపి, క్రమానుగత రక్త పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఛాతినొప్పి, శ్వాస ఆడకపోవటం, బలహీనత, ఎముక, కీళ్లనొప్పి, బరువు కోల్పోవటం లాంటి లక్షణాలను ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో గమనిస్తామని, సరైన సమయంలో అవగాహన, శ్వాస దృఢత్వ పరీక్షల వల్ల ఇటువంటి క్యానర్సర్‌ల బారి నుండి బయటపడ వచ్చున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ చిత్రలేఖనం వేసిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అంద జేశారు.

జిఎంసి స్టాండింగ్ కమిటీకి

ముగిసిన నామినేషన్లు

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు నగర పాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికలకు సంబంధించి మంగళ వారంతో నామినేషన్ల గడువు ముగిసింది. మొత్తం 7గురు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో శ్యామల వెంకట రమణాదేవి, అడకా పద్మావతి, మల్లిబోయిన శ్రీవల్లి, సంకూరి శ్రీనివాసరావు, పాపతోటి అంబే ద్కర్, కంద్రగుంట గురవయ్య, షేక్ మహమూద్ ఉన్నారు. జిఎంసి స్టాండింగ్ కమిటీకి ఆగస్ట్ 11 న ఎన్నిక జరుగుతున్న విషయం విదితమే. కాగా బుధవారం నామినేషన్ల స్క్రూట్నీ నిర్వహించి, అర్హత కల్గిన వారి జాబితాను ప్రకటిస్తారు. 7వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు తుది జాబితా విడుదల చేస్తారు.11వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

శ్రీ చైతన్య టెక్నో విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి షరాఫ్ బజార్‌లోని శ్రీ చైతన్య టెక్నో విద్యార్థులు జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ప్రతిభావంతులను వెలికితీసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నాసా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెస్ సెటిల్మెంట్ -2023 ప్రోగ్రాంలో శ్రీ చైతన్య పాఠశాల 8వ తరగతి విద్యార్థులు ఆరుష్, రాజు, పార్థశ్రీవల్లి, యాస్మిన్, అక్షయ కృష్ణ, భానుశ్రీ సమర్పించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుక్కమళ్ల వాసు విద్యార్థులకు షీల్డ్‌లు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

13న బాలోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి :స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 13వ తేదీ మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో జరగనున్న చిత్రలేఖనం పోటీల బ్రోచర్లను తాడేపల్లి పట్టణంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం అంద జేశారు. 8, 9, 10 తరగతులు సీనియర్స్ విభాగం, 6, 7 తరగతులు జూనియర్స్ విభాగం, 3, 4, 5 సబ్ జూనియర్స్ మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంటి ఎంసి బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు. జెండా వందనం, స్వాతంత్ర సమరయోధులు, దేశమును ప్రేమించుమన్న చరణాలపై చిత్రలేఖనం పోటీలు ఉంటా యని చెప్పారు. అమరావతి ఐకాన్ అపార్టుమెంట్లోని ఫంక్షన్ హాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేవాళ్లు ఈ క్రింది నంబర్లకు 9490099559, 9866029486 10వ తేదీలోపు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు పాల్గొన్నారు.